# శ్రీమతితో సినిమాకు

ఆర్. ప్రకాశ్‌రావు

" ఏమండోయి యివాళ సెలవు పెట్టండీ' అంది ప్రమీల.

" సినిమాకు మీతో కలసి వెళ్ళాలనివుంది " సినిమాకు పోవటానికి సెలవెందుకూ , ఏ సెలవు రోజో పోదాము అన్నాడు ఆనందం డ్రసుచేసుకుంటూ.

సెలవు రోజు టిక్కెట్లు దొరకవు. మీరుతీసుకుని వెళ్లేది లేదనరాదా....'

అంది జాలిగా ప్రమీల. కండ్లలోంచి నీరు ప్రవహించటానికి తయారుగా వున్నాయి. ఆనందానికి ఆఫీసు పని అడ్డంగా తోచిందిగానీ, ఆ మాటంటే ప్రమీల కళ్ళల్లో నీళ్ళుకారి పోతాయని సరేలే ! అన్నాడు. అయినా ఆఫీసుపని ఎంత చేసినా తరుగదు. ఆఫీసు కాగితాలు ఎప్పుడూ. సముద్రం లోని అలల్లా వస్తాయి, తనకూ "బోర్" కొట్టునేవుంది. సినిమాకు పోతేబాగానే వుంటుందనుకొన్నాడు. " సరేలే ప్రమీలా ! మధ్యాహ్నం సెలవు పెట్తాను అన్నాడు ధైర్యంగా.

" మీరు 12 గంటల కల్లా పర్మిషను తీసుకరావాలి సినిమా రెండున్నరకు మొదలు పెట్తారట మనము ఒంటి గంటకు బయలు దేరాలి. సినిమా పేరు భార్యాభర్తలు. " " భార్యాభర్తలా ! దీనికి సినిమా చూడాలా మనకు తెలియదూ, దాంట్లో ఏముందో వరెనేను వస్తాను. ప్రమీలా నీవు 11 గంటలకే ముస్తాబు మొదలుపెట్టు. లేకపోతే మనము సరిగ్గా 'టైముకు' చేరలేము. సరేనేను వస్తాను. పదికావొస్తున్నది. ఆఫీసుకు 'టైం' అయింది. " "ఏమండోయి ఒక్కమాటు యిల్లారండి అనిఅంది ప్రమీల. గేటుదగ్గరికి వెళ్ళిన ఆనందం మరల తిరిగి వస్తూ " " అబ్బ చంపక చెప్పుదూ టైములేదు. అటెండెన్సు రిజిష ఆఫీసరు దగ్గరకు పోబోతూ ఉంటుంద న్న ఆలోచనతో ..తమత మవుతూ

'ఏమండి నేను ఏచీరె కట్టుకొనేదండి పెండ్లిలో మా వాండ్లు పెట్టిన చీరెలేక మా అన్న పెండ్లిలో మావాండ్లు పెట్టిన చీరలేక మా అన్న కొడుకు అన్న ప్రాశనకు మనము పోయినప్పుడు మా అన్నవాండ్లు పెట్టిన చీరే లేక మనము ఈ వూరి బదిలీ అయినపుడు నా స్నేహితురాలు యిచ్చిన చీరె "

ఏదో ఒకచీరె కట్టుదూ ! ఏ చీరె కట్టుకొన్న సినిమాలోకి రానిస్తారులే నాకు' టైం అయింది నేను వెళ్లాలి' ।

" అదుగో, అదుగో నా చిరెఅంటే. మీకెంత అయిష్టంగా ఉందో. అంతకంటె నాతోకూడా సినిమాకురావడం నాకు యిష్టము లేదని చెప్పగూడదూ! నా కర్మం అంటూ యింట్లో నే ఉండక పోయానా అంది ప్రమీల " దండకము అపు ప్రమీలా ! నేను తొందరగా వెళ్లేటప్పుడు యిలాంటిప్రశ్న వేస్తే ఎలా చెప్పు. పైగానేను ఏదో ఒకటి చెప్తే నీకునచ్చదు నా జవాబు. వెళ్ళివస్తాను అంటూ పరిగెత్తాడు ఆనందం మరల శ్రీమతి గారి ప్రశ్నలకు తావివ్వకుండా

" తొందరగారావాలి. తప్పకరావాలి, మీ కోసం ఎదురు చూస్తుంటాను. అన్నమాటలు చెవుల్లో రింగుమంటున్నాయి.

ఆనందానికి కూడా ప్రమీలతో కలిసి ఖుషీఖుషీగా కబుర్లు చెప్పుకుంటూ "షికారు" తిరగాలనే వుంది. కాని ప్రమీలతో ఎక్కడికి పోవాలన్నా అంటును తనను. తనపొడుగు పెళ్ళాన్ని చూచి నవ్వుతారనే భయం ఆనందాన్ని ఎల్లప్పుడూ ఆవరించే వుంటుంది. సరే ఈ రోజు సినిమాతప్పదు అనుకుని. ఆఫీసు నుంచి త్వరగానే బయట పడ్డాడు.

ఇంటికి వెళ్ళి "టంగ్ టంగ్" మని సైకిలు గంట గేటు తీసినచప్పుడికి పోసుమా - అనుకొని అవరండలో పడేసి వెళ్ల ఉత్తరాలు అంది ముస్తాబులోని

మగ్నమయిన ప్రమీల. కాని యింటి వరండా గ్రిల్స్ తలుపు శబ్దము వినేటప్పటికి ఎవరా వచ్చింది. అంటూ తొంగిచూసింది. తన కండ్లను తానే నమ్మ లేక పోయింది ఆనందము వస్తాడన్న ఆశపూర్తిగా లేదు. ఆఫీసరు శెలవు యివ్వలేదనో, ఆడిటర్ జన రలు క్యాంపు వచ్చేడనో లేక వూరినుంచో క్లాసు మేటు వచ్చేడనో సినిమాకు రావడానికి వీలుకాలేదు ప్రమీల అని సాయంత్రము క్షమాపణ కోరుతూ వస్తా డనుకొన్న ఆనందం నిజంగా తనను ఈ దినము సినిమాకు పిల్చుక పోవడానికి వచ్చాడా! ఎంత అదృ ష్టం ఈ నాడు, ఆమె ఆనందము అవధులు దాటింది. శరీరమంతటా గగుర్పాటు కలిగింది. ఆనంద అశ్రు వులు కండ్లలోంచి రాలినయి. "మీరు నిజంగా నన్ను సినిమాకు పిల్చుక పోతారా! " అంద తన్మయ త్వంలో అతని హృదయం పై తన తలకాన్చి ' పిచ్చిదానా! మాట చెప్పినతర్వాత విధిలేక పోతేగాని, నేను తప్పుతానా ! అన్నాడు సగర్వంగా ఆడిటరు ఆనందం.

" సరేతొందరగా కానివ్వండి. టెబులు మీద టి ఫిను తయారుగా వుంచాను. తర్వాత డ్రెస్ చేసు కోండి. అదిసరెగాని ఏ మండి నేను కట్టుకున్న చీర బాగుందా? " అనిఅడిగింది. 'ఒక్క బాగేమిటి అమో ఘంగావుంది. అద్వితీయముగానుంది. అన్నాడు నిజంగా తనకిష్టము లేక పోయినా లేక పోతే మరో గంట ఆలస్యం చీరె మార్చడానికి.

'ఏ మండోయి మీరింకా 'రెడి' కాలేదు' అన్న కేకతో ఆనందం. వాస్తవ ప్రపంచంలోనికి వచ్చాడు. అంత వరకు సినిమాకు ఎలా వెళ్ళాలి అన్న ఆలో చనతో కుస్తీ పడుతున్నాడు. నాదే ముందీ ! నేను రడీ అన్నాడు ఆనందం,

' హవ్వ హవ్వ మీరు సినిమాకు యీ గుడ్డలతో వస్తారా, పైగా గడ్డం కూడా చేసుకోలేదే మండి.

మొదలే మీ వెంట్రుకలు తళతళ మెరుస్తూ వుం టాయ్.

' ఏం యీ గుడ్డలు బాగానే వున్నాయి' అన్నాడు ఆనందం, అంతే లేండి నాతో సినిమాకు రమ్మంటే చింపి తల పెరిగిన గడ్డము మాసిన బట్టలు పిచ్చి వాడిలా వస్తానంటారు. మీస్నేహితులతో పోవాలంటె నీటుగా మంచిబట్టలేసుకెల్తారు. యింతకంటే నాతో రావడం మానేయండి!

"యింతకంటె మంచిగుడ్డలు చాకలివాడిదగ్గర పడివున్నాయి. అని అన్నాడు ఆనందం, ఒక జత మంచిగుడ్డలు నా పెట్టెలో వారంరోజుల క్రిందటే దాచానులెండి అవివేసుకొండి'' అంది.

"చిత్తం'' అంటూ ఆజ్ఞ శిరసావహించాడు, ఇందిరాగాంధి ప్రభుత్వంలో ఆడవాళ్ళమాట కెదురు చెప్పడానికి వీలులేదుగా, అనిలోపలఅనుకొని

"ఏమండోయ్. ఆహవాయి చెప్పులు అవతల పారవెసి. బూటు తొడుక్కొండి. సాక్సు నైలాను వేసుకోండి. కాటన్‌వి వద్దు. గడియారం కుడిచేతికి పెట్టుకొండి. క్రాపు నొక్కులు నొక్కులుగా అమర్చు కోండి. నాతోవచ్చేటప్పుడు షోకుగావుండాలి అంది. అన్నది ప్రమీల

"నేనేమన్నా పెండ్లికి" ..యింటర్వ్యూకు" పోతున్నానా ..బ్యూటీ కంటెస్టుకు" పోతున్నానా అన్నాడు ఆనందం. అదొక్కటే తక్కువంది నవ్వుతూ ప్రమీల.

ఎలాగైతేనేం రెండుగంటలకు బయలుదేరారు. ..నేను సైకిలులోవెల్లి ముందుటిక్కట్టు తీసిపెడ్తాను. నీవు బస్సులోవచ్చేయి" అన్నాడు ఆనందం. సైకిలు ఎక్కి ప్రక్కకుచూచాడు ప్రమీల వైపు. సైకిలుమీద తాను ఎక్కికూర్చున్నా తనకంటె పొడుగుగానే కన్పించింది ప్రమీల. గుండె గతుక్కుమన్నది. మనిషి జానై పోయాడు. ..ఏమండోయ్ నేను ఒక్కత్తెనురాను. ఇద్దరము కలిసిపోదామని ప్రొద్దు న్నుంచే నేను ఆనందపడుతుంటే మీరు వేరుగా నేను వేరుగా రావడానికి నాకేంయిష్టంలేదు. పైగా అక్కడి కొచ్చిన తర్వాత నీవు ఆండవాండ్లవైపు పో, నేను

మగవాండ్లవైపు కూర్చుంటాను" అన్నారంటే నేను ఒప్పుకోను. ముందేచెప్తున్నాను. మొట్టమొదటి సినిమాకు మనము కలిసిపోతూ యిలాచేస్తే ఎలాగండి" అంది ఆనందంతో. పచ్చివెలగకాయపడినట్లయింది శరీరమంతా ముచ్చెమటలు పోసినయి రానున్న ప్రమాదాన్ని తలుచుకొనేటప్పటికి " ఏడుకొండలవాడా నీవేదిక్కు. ఎలాఅయితే అలాకానిఅని లోపలఅనుకొని సైకిలు వరండాలోపడేసి పద పోదామన్నాడు ప్రమీలకేసిచూచి. నీలిరంగు పట్టుచీరె కట్టుకొని ప్రమీల పట్టరాని సంతోషంతో ప్రయాణమైంది ..పిక్చరుకు" మీవారితోకలిసి ఎన్నిసినిమాలు చూశావేఅని తననేస్తం కమల వేసినప్రశ్నకు ఈసారి ఊరికివెల్లినపుడు బాగాజవాబు చెప్పాలనుకుంటూ పయనమైంది ప్రమీల,

రిక్షాలో పోదామంది ప్రమిల, 'అదుగో బస్సు వస్తుంది" అన్నాడు ఆనందం, బస్సులో ఖాళీసీటు లేనందువలన ప్రమీల ఆడవాళ్ళసీటులో కూర్చుంది. ఒకప్రమాదం తప్పించావుగదా భగవాన్ అని లోపల ఏడుకొండలవాడిని తలుచుకొన్నాడు. లేక బస్సులో వాండ్లంతా మావైపేచూచేవారుకదాఅని మనస్సులో అనుకొని, కాని ప్రమీలకు తను శ్రీవారు ప్రక్క ప్రక్కగాకూర్చొని పోదామన్నకోర్కె తీరనందుకు మనసు కొంచెం కలవరపడింది.

కండక్టరు "టిక్కెటు" అంటూ అరుస్తున్నాడు. చాలమంది ఆడవాండ్లు టిక్కెట్టుకొనడంచూచి ప్రమీలకు కూడా టిక్కెట్టుతానే కొందామనిపించింది. తను ఇదివరలో ఎప్పుడు టిక్కెట్టు కొనలేదు. కండక్టరు ఎక్కడికి" అని అడిగితే భార్యాభర్తలు సినిమాకు అని చెప్పేసింది. ప్రక్కన ఉండేవాడ్లు, కండక్టరు ఆ మాటకు నవ్వారు. మరల "ఎక్కడికమ్మా" అన్నాడు కండక్టరు, దిలషాద్‌టాకీసు అన్నది ప్రమీల, ఈసారి గూడా కండక్టరు నవ్వాడు, ఆనవ్వుచూస్తే వాడేదో రౌడీవెధవలాకన్పడ్డాడు ప్రమీలకు ఆనందం దూరంనుంచి "కోఠికి రెండు టిక్కెట్లు ప్లీజ్ అని అరిచాడు. ప్రమీలకూడా తల వూపింది, కండక్టరు నవ్వుతు "ఆస్పత్రి నుంచా" అని అడిగాడు. ప్రమీలకు పట్టరానికోపము వచ్చింది, ఈ కండక్టరు వెనవ తను పిచ్చాస్పత్రినుంచి వస్తున్నాననుకొని కోపంతో 'ఊ' అని అంది, "ఫ్రమ్ మాసబ్‌టాంకు, ప్లీజ్" అన్నాడు ఆనందం. కండక్టరు టిక్కెట్టుయిచ్చి వెళ్ళిపోయాడు. ప్రమీల కింతెలుసు వాండెక్కిన బస్సు సరోజనిదేవి ఆస్పత్రినుంచి బయలుదేరుతుందని.

కోఠీలో బస్సుదిగి దిల్‌షాద్ టాకీసు వైపు నడుస్తున్నారు. ప్రమిలా ఆనందం. 'కొంచెము తొందరగానడు ప్రమీలా సినిమా మొదలు పెట్టారు'అంటూ ముందుగా నడుస్తున్నాడు ఆనందం,

'అబ్బా ఆగండి. ఎందుకలా పరుగెత్తుతారూ, సినిమా రెండున్నర గంటలకు కదండి, ఇంకా పదిహేనునిమిషాలు టైముందికదా! న్యూస్ రివ్యూముందు మొదలెట్టారు. దాంట్లో వెస్టిండీస్ యిండియా కలకత్తా క్రికెటు టెస్ట్ చూపిస్తున్నారట" అంటూ పెద్ద పెద్ద అంగలేస్తున్నాడు ఆనందం ఎక్కడ ప్రమీల తనను కలుసుకొంటుందో అనే భయంతో.

ప్రమీలకు ఆనందం ఎందుకు పరుగెట్టాడో యిప్పటికి తెలియదు. ఎలాగైతేనేం చిన్నగా తను సినిమాహాలు చేరేటప్పటికి ఆనందం రిజర్వుడుకు టిక్కెట్లు రెండు తీసుకొని నిలబడి వున్నాడు. నలువైపులా చూశాడు, ఎవరూ లేరనే ధైర్యంతో తను ప్రమీలా కలిసి రిజర్వుడు క్లాసు దగ్గరకు వెళ్లారు. అక్కడే గేటుకీపరు తనను చిన్ననవ్వుతో అదోరకంలా చూచినట్లనిపించింది. కొంపదీసి తనను, తన పొడుగుపెళ్ళాన్ని గురించి కాదుకదా వీడు నవ్వటం అని అనుకున్నాడు. లోపలకు వెళ్ళేటప్పటికి సినిమా మొదలు పెట్టారు, అమ్మయ్య అనుకొన్నాడు ఆనందం. సినిమాలో కూర్చున్నాడే కాని ఆనందం ఎంతసేపటికి ఎవరైనా తనకు తెలిసినవాళ్ళెవరైనా వచ్చారేమో అని నాలుగువైపులా చూస్తున్నాడు. కాని చీకట్లో సరిగా కనపడలా, ప్రమీల మాత్రం సినిమా బాగా ఆనందంతో చూస్తున్నది. అప్పటికి ప్రమీల మెల్లగా అంది సినిమావైపు చూడండి అని. 'ఆ' అన్నాడు ఆనందం, మధ్యలో యీసీను చాలా బాగుందికదూ! యీపాటయెంచక్కగా వుంది, రేలంగి యాక్షను చూడండి అబ్బా పొట్ట

చెక్కలయ్యేటట్టుంది అంటూ తనమీదకు వరిగింది నవ్వుతూ. 'అబ్బా ఎవరన్నా చూస్తారు అన్నాడు ప్రమీల చెవ్వులో పర్వాలేదులేండి అంటూ ప్రమీల అలానే ఉండిపోయింది. ఉన్నట్లుండి లైట్లు ఒక్కసారిగా వెలిగాయ్. ప్రాణం గతుక్కుమంది. ఇంట ర్వెలు గంట కొట్టగానే బయటకు పరుగెత్తి పోదామనుకున్న తనకు అకస్మాత్తుగా లైట్లు వెలగడం చాలా ఆశాభంగం కల్గించింది.

అనుకున్నంత పని అయింది. తన వైపు చూస్తున్నది ఒక అమ్మాయి. ఎవరది. ప్రక్క సెక్షనులో పనిచేసే పారిజాతం మాదిరుందే! పారిజాతం మాదిరేమిటి. పారిజాతమే ! ! తను కూడా ఆఫీసు ఎగ్గొట్టి సినిమాకు వచ్చిందేమిటి. ప్రక్కనున్న వాడెవరబ్బా మన ఆఫీసు రకంగాలేదే! ఆమె చిరునవ్వు నవ్వింది. తను చిరునవ్వు నవ్వాడు. 'ఏమండోయ్. మెడ పట్టుకుపోతుందండి అలానే చూస్తే' అంది. వెంటనే తనను సంభాళించుకొని మా ఆఫీసుఅమ్మాయి పేరు పారిజాతం పని బాగా చేస్తుంది. అన్నాడు ఆనందం. 'యింకేం అయితేమాత్రం అలా చూస్తారటండీ అంది కొంటెగా ప్రమీల. అందుకనే కాబోలు ఆఫీసునుంచి యింటికి తొందరగాతారు'

ఆనందానికి భయం పుట్టుక వచ్చింది. శరీరమంత వణకనారంభించింది. రేపు ఆఫీసు మహిళా మండలిలో "లంచ్ టైమ్ సబ్జక్టు" తను తనపెడుగు పెళ్లాన్ని గురించే! తల తిరగనారంభించింది. వెంటనే కాంటీను దగ్గర చెట్టుక్రింద పారిజాతం. వసుమతి. మందిర మల్లిక, భూదేవి, కమల విమల మొదలగు ఆఫీసు అమ్మాయిలు తనవైపుచూచి విరగబడి నవ్వుతున్నట్లనిపించింది. నీసంగతి మాకు తెలుసులేఅన్నట్లు వాళ్ళ నవ్వులోని అంతరార్థం తను ఖూనీఅయి పోతున్నాడు. ఎలా అబ్బా అనుకున్నాడు. వెంటనే ఒక ఆలోచన తట్టింది. సినిమా కాగానే పారిజాతాం వచ్చింది. "ఎవరు..." అంది ప్రమీలను చూపిస్తూ. "నా స్నేహితురాలు...." అన్నాడు ఆనందం తడుముకోకుండా. ఆనందంతో స్నేహం అనందంగా వుంటుందికదూ" అంది పారిజాతం. అదొక రకమైన నవ్వుతో వెళ్తూ.

ప్రమీలకు చాలా కోపము వచ్చింది. తన పెళ్ళాంఅని చెప్పుకోడానికి ఈ మనిషికి యింత నామూషీ ఎందుకో! తనతో కులాసాగా వుండడానికి కూడా కష్టం ఎందుకో!

రిక్షాకోసం ఎదురు చూస్తుంది ప్రమీల. చిన్ననాటి స్నేహితురాలు కమల కనిపించింది. ప్రమీలా... అంటూ పిలుస్తూ రోడ్డుదాట వచ్చింది. ఆనందం వక అడుగు వెనక్కు వేశాడు.

"ఈమెది మా ఊరే...... కమల ..చాలా కాలం తర్వాత కలుసుకున్నాం. ఇక్కడే ఉద్యోగం చేస్తోంది . . ." ప్రమీల చెప్పుకుపోతుంటే కమల ఆనందంవంకనే చూస్తోంది. ప్రమీల భుజాల ఎత్తులో కనబడుతున్నాడు ఆనందం. కమల కొంచెం తటపటాయించి 'ఏమే నీ మరిదిగారు గూడా ఇక్కడే ఉంటున్నారా . . . అంది ఆనందంవంక చూస్తూ అనుమానంగా. ప్రమీలకు నవ్వు వచ్చింది.

'మా మరిదిగారు గూడా ఈ ఊళ్ళోనే ఉంటున్నారు గానీ . . వీరు మా మరిదిగారి అన్నగారు... మావారు.." అన్నది.

ఆ మాటవిన్న ఆనందం అర అడుగుపొడుగు ఎదిగాడు.